



అభిమానులకు అభివాదం

మీకు తోడుగా మేమున్నాం



అల్వాల గ్రామంలో కర్రెక్క చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి



అగ్రహారంలో సుధాకర్‌నాయుడు భార్య రాధమ్మ కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న భువనేశ్వరి

- ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదాం
- కుటుంబ పెద్దను కోల్పోయామని అధైర్య పడవద్దు
- టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు నారా భువనేశ్వరి భరోసా
- రూ.3 లక్షల ఆర్థిక సాయం



గోనెగండ్ల మండలం యర్రబాడులో కౌలుట్లయ్య భార్య లక్ష్మిదేవికి చెక్కును అందజేస్తున్న భువనేశ్వరి



ముగతి గ్రామంలో నాగరాజు భార్య లలితాంబను ఓదార్చుతూ..

కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి)/ఎమ్మిగనూరు: 'మీకు తోడుగా మేమున్నాం.. అధైర్య పడవద్దు.. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదాం..' అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి బాధిత కుటుంబా లకు భరోసా ఇచ్చారు. రెండో రోజు ఎమ్మిగనూరు నియోజకవర్గంలో చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తల కుటుంబాల ఇళ్లకు వెళ్లారు. వారి కుటుంబ సభ్యులతో కొంత సమయాన్ని గడిపి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లల చదువుల వివరాలు తెలుసుకొని వారి భవిష్యత్తు ప్రణాళిక ఏమిటో విచారించారు. భావోద్వేగానికి లోనైన టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధిత కుటుంబ సభ్యులు కన్నీరు పెడితే భువనేశ్వరి కూడా కంటతడి పెట్టారు. ఎమ్మిగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడుతో కలిసి ఒక్కో కుటుంబానికి రూ.3 లక్షల చెక్కును అందించారు. ఐదు బాధిత కుటుంబాలకు మొత్తం రూ.15 లక్షల ఆర్థిక సాయం అందించారు.

భువనేశ్వరి పరామర్శించిన కుటుంబాలు..

- నందవరం మండలం మాచాపురం గ్రామంలో చంద్రబాబు అరెస్టును జీర్ణించుకోలేక టీడీపీ కార్యకర్త హనుమంతు అక్టోబరు 24న గుండెపోటుతో మృతి చెందారు. ఆ ఇంటికి భువనేశ్వరి వెళ్లి హనుమంతు కుటుంబ సభ్యుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు.
- ముగతి గ్రామంలో సెప్టెంబరు 23న టీడీపీ కార్యకర్త నాగరాజు మనోవేదనకు గురై మృతి చెందారు. ఆ కార్యకర్త ఇంటికి వెళ్లిన భువనేశ్వరిని చూడగానే నాగరాజు భార్య లలితాంబ కన్నీరు పెట్టారు. ఆ సమయంలో భువనేశ్వరి కళ్లు చెమర్చాయి. కొన్ని క్షణాలు ఏమి మాట్లాడక బాధతో ఉండిపోయారు. ఆ తర్వాత తేరుకొని 'అమ్మా కుటుంబ సభ్యులను కోల్పోతే ఆ బాధ ఎలా ఉంటుందో మాకు తెలుసు.. ధైర్యంగా ఉండు.. మేము ఉన్నామంటూ' భరోసా ఇచ్చారు. ఆర్థిక సాయం చెక్కు అందజేశారు. ఈ సమయంలో లలితాంబ మాట్లాడుతూ ఓ తల్లిలా మా ఇంటికి వచ్చి మా యోగ, క్షేమాలు తెలుసుకొని ధైర్యం చెప్పడం మరువలేమని అన్నారు.
- గోనెగండ్ల మండలం అగ్రహారం గ్రామంలో సెప్టెంబరు 12న టీడీపీ కార్యకర్త సుధాకర్‌నాయుడు మృత్యువాత పడ్డారు. వారి ఇంటికి నారా భువనేశ్వరి వెళ్లి సుధాకర్ నాయుడు భార్య రాధమ్మ, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నారా కుటుంబం మీకు అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆర్థిక సహాయం చెక్కును అందజేశారు.
- గోనెగండ్ల మండలం అల్వాల గ్రామంలో సీనియర్ టీడీపీ కార్యకర్త ఆరెకంటి ఈరన్న సెప్టెంబరు 10న మృతి చెందారు. భువనేశ్వరి ఈరన్న ఇంటికి వెళ్లి ఆయన భార్య కర్రెక్కను పరామర్శించారు. రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా కర్రెక్క మాట్లాడుతూ 'అమ్మా నా భర్త ఎప్పుడూ టీడీపీ కోసమే పనిచేశారు. చంద్రబాబు అరెస్టును తట్టుకోలేక చనిపోయారు' అంటూ కంటతడి పెట్టారు. మీరు రావడం కొండంత ధైర్యాన్ని ఇచ్చిందని అన్నారు.



నందవరం మండలం మాచాపురంలో చెక్కును అందజేస్తూ...

- గోనెగండ్ల మండలం యర్రబాడు గ్రామంలో సెప్టెంబరు 18వ తేదీన టీడీపీ కార్యకర్త కౌలుట్లయ్య చంద్రబాబు అక్రమ అరెస్టు తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందారు. కౌలుట్లయ్య భార్య లక్ష్మిదేవి కుటుంబ సభ్యులను నారా భువనేశ్వరి ఓదార్చారు. పిల్లలను దగ్గరకు చేర్చుకొని ధైర్యం చెప్పారు. రూ.3 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. పార్టీ అండగా ఉటుందని భరోసా ఇచ్చారు.

● వెల్లువలా తరలి వచ్చిన అభిమానులు

నిజం గెలవాలి యాత్రలో భాగంగా రెండో రోజు నారా భువనేశ్వరి ఎమ్మిగనూరు టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డితో కలిసి ఆ నియోజకవర్గంలో పర్యటించారు. పల్లె పల్లెనా అభిమానులు వెల్లువలా తరలివచ్చి స్వాగతం పలికారు. ఆదోని నుంచి బయలుదేరిన భువనేశ్వరి ఉదయం 10 గంటలకు ఎమ్మిగనూరు మండలం కొటేకల్లుకు రాగానే.. మాజీ ఎంపీపీ శంకరయ్య, కొటేకల్లు, దేవిబెట్ట టీడీపీ నాయకులు నీలి నాగయ్య, సోమేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది టీడీపీ కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చారు. దీంతో భువనేశ్వరి కారు ఆపి వారిని ఆప్యాయంగా పలకరించారు. యాత్ర సాగిన నందవరం, మాచాపురం, ముగతి, గోనెగండ్ల మండలం అగ్రహారం, గంజహళ్లి, గోనెగండ్ల, కులుమాల, చిన్నమర్రివీడు, అల్వాల, పిల్లిగుండ్ల, నెరడుప్పల, యర్రబాడు గ్రామాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి భువనేశ్వరికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి బీవీ జయనాగేశ్వరరెడ్డి, మంత్రాలయం, పాణ్యం, ఆలూరు, ఆదోని టీడీపీ ఇన్‌చార్జిలు పాలకుర్తి తిక్కారెడ్డి, కోట్ల సుజాతమ్మ, గౌరు చరిత, కె.మీనాక్షినాయుడు, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముగతి ఈరన్నగౌడు, మాజీ జడ్పీ వైస్ చైర్మన్ పుష్పావతి, టీడీపీ నాయకులు గుడిసె కృష్ణమ్మ, వైకుంఠం ప్రసాద్, వైకుంఠం జ్యోతి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మాదవరావ్ దేశాయ్, గోనెగండ్ల సర్పంచ్ హైమావతి, మాజీ వైస్ ఎంపీపీ రఘుమూర్తి స్వామి, ఎమ్మిగనూరు మాజీ ఎంపీపీ వాల్మీకి శంకరయ్య, కొటేకల్లు ఖాజా, సోమేశ్వరరెడ్డి, భార్గవ్, అల్వాల సర్పంచ్ బాషా, మాచాపురం కాశింవలి, చిన్నరాముడు, మురళి, కడిమెట్ల సురేంద్రరెడ్డి, మల్లికార్జున, నజీర్, అల్తాఫ్, ముగతి మాజీ సర్పంచ్ బాలరాజు, గోనెగండ్ల ఎస్సీ రామాంజనేయులు, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.



గజ్జెహళ్లిలో ట్యాంకర్‌ల ద్వార మిరప పంటకు నీరు పెడుతున్న రైతు

మిరప పంటకు ట్యాంకర్లతో నీరు

- నీటి కోసం రోజుకు 40 వేలు ఖర్చు పెడుతున్నరైతు

హొళగుంద, జనవరి 10 : మిరప పంట చేత్తికొచ్చే సమయంలో ఎల్లెల్సీ నీరు నిలిచిపోయింది. దీంతో గజ్జెహళ్లి గ్రామానికి చెందిన రైతు బజారి కన కప్ప రోజుకు రూ.40వేలు ఖర్చు పెట్టి ట్యాంకర్లతో పొలాన్ని తడుపు కుంటున్నాడు. ఆయన నాలుగు ఎకరాలలో మిరప పంట సాగు చేశాడు. దానికి రూ2.5 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టాడు. మిరప పంట చేత్తికొచ్చే సమయాన గత నెల 25న ఎల్లెల్సీలో నీరు నిలి చిపోయింది. దీంతో మిరప పంటను కాపాడుకోవడానికి పది రోజులకు ఒక్కసారి నలభై వేల రూపాయలు ఖర్చు పెట్టి ట్యాంకర్‌తో నీరు పారిస్తున్నాడు.

గోపూజ మహిమాన్వితం

- ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు



కర్నూలు(కల్చరల్), జనవరి 10: గోమాతను పూజిస్తే సకల దేవతలను పూజించినట్లేనని, కలి యుగంలో గోపూజ మహిమాన్వితమైనదని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు భక్తు లకు ఉద్బోధించారు. కర్నూలు జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు 'చాగంటి కోటేశ్వరరావు ప్రవ చనామృతం' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. నగ రంలో బళ్లారి చౌరస్తా సమీపంలోని ఏపీఎస్పీ బెటాలియ న్‌లోగల టీజీ వెంకటేశ్ అవుట్ డోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. తొలిరోజు బుధవారం సాయంత్రం చాగంటి కోటేశ్వరరావు 'గోమాత వైభవం' అనే అంశంపై ప్రవచనాలు చెప్పారు. సృష్టిలో పరమ భాగవోత్తములు భగవంతుడి దర్శనం కోరుకున్నప్పుడు ఆయన ఏదో ఒక అవతారరూపాల్లో దర్శనం ఇస్తారన్నారు. సకల సృష్టికి మూలమైన జగన్మాత మూడు రూపాల్లో దర్శనమిస్తుందని గోమాత, భూమాత, జగన్మాతగా ఆమెను భక్తులు దర్శించుకునే అవకాశం ఉందన్నారు. భక్తులు సులువుగా పూజించే మార్గాల్లో గోప్రదక్షిణ ఒకటని, గోపూజలకు సమయం, సందర్భం అంటూ ఏదీ లేదని చెప్పారు. గోపూజ గురించి పంచమ వేదమైన మహాభారతంలో భీష్మాచార్యులు అనేక విషయాలు చెప్పారని అన్నారు. శాంతి, అనుశాసైనిక పర్వాల్లో గోమాత గురించి గొప్పగా వర్ణన ఉందని తెలిపారు. ఇదిలా ఉండగా రెండు రోజుల ఆధ్యాత్మిక ప్రవచనాలు ఇచ్చేందుకు కర్నూలుకు వచ్చిన చాగంటి కోటేశ్వరరావు దంపతుల ను యువ నాయకుడు, టీజీ గ్రూప్స్ జూనియర్ చైర్మ న్ టీజీ భరత్ కలిసి పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్ర మంలో వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, దేవాలయాల కమిటీ ప్రతినిధులు, భక్తులు, చాగం టి అభిమానులు వేలాదిగా తరలివ చ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీజీబీ యూత్ సభ్యులు, బెటాలియన్ పోలీసు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. గురువారం ప్రవచనామృతం కార్యక్రమంలో భాగంగా 'జగన్మాత వైభవం' అనే అంశంపై చాగంటి కోటేశ్వర రావు ప్రవచనాలు చెబుతారు.



ప్రవచనాలు వినేందుకు తరలివచ్చిన కర్నూలు నగర ప్రజలు

పెళ్లి చేసుకుని మోసం

- ఇల్లు కట్టిస్తానని రూ.10 లక్షలు తీసుకున్న వైనం
- విశాఖ నుంచి కర్నూలుకు కేసు బదిలీ

కర్నూలు, జనవరి 10: ఓ మహిళను పెళ్లి చేసుకొని రూ.10 లక్షలతో ఉడాయించిన వ్యక్తిపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. కర్నూలు నగరంలోని ఇందిరాగాంధీ నగర్‌కు చెందిన గౌతమి తన భర్త నుంచి విడాకులు తీసుకొని హైదరాబాదులో ఉద్యోగం చేస్తోంది. ఈమెకు ఒక కొడుకు ఉన్నాడు. ఆమె పని చేసే చోట విశాఖ పట్టణానికి చెందిన యోగేస్ కుమార్ పరిచయమయ్యాడు. ఆమెను పెళ్లి చేసుకుంటానని, కొడుకును బాగా చూసుకుంటానని నమ్మించాడు. ఆమె తల్లి దండ్రుల అనుమతితో పెళ్లి చేసుకున్నాడు. ఆ తర్వాత కొంత కాలం కాపురం చేసి విశాఖలో ఇల్లు కట్టిస్తానని యోగేస్ కుమార్ రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఎడాది గడిచినా ఇంటి విషయం మాట ఎత్తక పోవడంతో గౌతమి నిలదీసింది. దీంతో ఇంటి నిర్మాణం పూర్తయిందని చెప్పి గృహ ప్రవేశానికి గౌతమి తోపాటు ఆమె తల్లిదండ్రులను తీసుకెళ్లి ఓ లాడ్జిలో ఉంచాడు. రెండు రోజుల తర్వాత గృహ ప్రవేశానికి మంచి రోజులు లేవని, గృహ ప్రవేశం వాయిదా పడిందని వారిని తిరిగి కర్నూలుకు పంపే ప్రయత్నం చేశాడు. దీంతో గౌతమి, ఆమె తల్లిదండ్రులు అతనితో ఘర్షణకు దిగారు. ఇరువురి మధ్య ఘర్షణ జరగడంతో పంచాయతీ పోలీసు స్టేషన్‌కు చేరింది. విశాఖ పట్టణ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసును కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంక రయ్య తెలిపారు.

సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలం

- కార్పొరేషన్ ఎదుట కార్మికుల పొర్లు దండాలు

కర్నూలు న్యూసిటీ, జనవరి 10: కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో వైసీపీ ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి పులగం మద్దిలేటి అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె బుధవారానికి ఎనిమిదో రోజుకు చేరింది. కార్పొరేషన్ ఎదుట కార్మికులు పొర్లు దండాలు పెడుతూ వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మద్దిలేటి మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి కార్మికులను విస్మరించారని ఎద్దేవా చేశారు. ప్రధాన డిమాండ్లు పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, నాయకులు బాబులాల్, మాణిక్యం, సవారి తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ ఎదుట పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రికార్డుల పరిశీలన వేగవంతం చేయండి

కర్నూల్ కలెక్టరేట్ జనవరి 10 : ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలనను వేగ వంతం చేయాలని ఇన్‌చార్జి భూపరి పాలన ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ అహ్మద్ ఆదేశించారు. బుధవా రం విజయవాడ సీసీఎల్‌ఏ కార్యాలయం నుంచి ఆయ అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీ హోల్డ్ అసైన్డ్ భూ ముల రికార్డుల వెరిఫికేషన్‌కి సంబంధించిన రోజు వారీ ప్రగతిని పరిశీలించాలని అన్నారు. జిల్లాలో ఈనామ్ భూములకు సంబంధించిన ఈ కేవైసీ అంశాల గురించి జిల్లాలో రివ్యూ నిర్వహించి పనులు పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. ల్యాండ్ టైటిల్ విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి జిల్లా నుంచి ఇద్దరు నోడల్ ఆఫీసర్లను ఎంపిక చేసి వారికి శిక్షణ కూడా ఇస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్వో మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం

కర్నూలు, కలెక్టరేట్ జనవరి 10: డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా వైసీపీ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతోందని విద్యార్థి యువజన సంఘాలు ఆరోపించాయి. బుధవారం కలెక్టరేట్ ముందు నిరుద్యోగులతో కలిసి చెప్పులు కుడుతూ నిరసన తెలయజేశారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయకుండా నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, భాస్కర్, శ్రీరాములు, కారుమంచి తదితరులు పాల్గొన్నారు.



చెప్పులు కుడుతూ నిరసన తెలియజేస్తున్న దృశ్యం

తైక్వాండో క్రీడాకారులకు అభినందన


తైక్వాండో క్రీడాకారులతో టీజీ వెంకటేశ్

కర్నూలు(కల్చరల్), జనవరి 10: ఇటీవల నంద్యాలలో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో క్రీడా పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అభినందించారు. బుధవారం సంకల్‌భాగ్‌లోని ఆయన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో టీజీ వెంకటేశ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు, క్రీడల్లో సమానంగా రాణించాలని సూచించారు. క్రీడలు మానసిక, శారీరక వికాసానికి దోహదపడతాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ టి.వెంకటేశ్‌తోపాటూ బంగారు పతకాలు సాధించిన శ్రీలలిత, సూర్య భార్గవ్, విశ్వాసరావు, వెండి పతకాలు సాధించిన ఉదయ్‌సింహా, ఎన్ఎస్ మల్లేష్, మనీషా, కాంస్య పతకాలు సాధించిన హరికృష్ణ, సర సింహా, భూపతిలతోపాటు కృష్ణవంశీ, టి.తిలక్, టి. సాయికృష్ణ పాల్గొన్నారు.

వడ్డె ఓబన్న ఆశయాలను సాధిద్దాం

» రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య

కర్నూలు(అర్బన్), జనవరి 10: వడ్డె ఓబన్న బ్రిటీష్ దొరలను గడగడలాడించిన మహా ధీరుడని, ఆయన ఆశయాలను సాధిద్దామని వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. బుధవారం కర్నూలు నగరంలోని బీసీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి సైన్యాధిపతికిగా పని చేసిన వడ్డె ఓబన్న బ్రిటీష్ పాలకులకు ఎదురొడ్డి నిలిచారని అన్నారు. నాడు ఆయన చేసిన పోరాటాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఆజాదికా అమృత్ మహోత్సవంలో భాగంగా గత ఏడాది వారి కుటుంబ సభ్యులను సత్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలిపారు. ఈ మేరకు గత స్వాతంత్ర్య వేడుకల్లో వడ్డె ఓబన్న వారసులను గుర్తించి వారికి ఘనంగా సన్మానించిందని అన్నారు. ఓబన్న సేవలను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం రెండు రోజుల కిందట ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని జీవీ జారీ చేసిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ నిర్ణయం హర్షణీయమని సంతోషం వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం కూడా వడ్డె ఓబన్న సేవలను గుర్తించాలని, ఆయన జయంతిని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. గురువారం జరిగే ఓబన్న జయంతిని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రూ.2.30 కోట్ల నిధులు మంజూరు

కర్నూలు(న్యూసిటీ), జనవరి 10: గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా చేపడుతున్న పనులకు నిధులు మంజూరు చేస్తూ కలెక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. మొత్తం 5 వార్డులలో 46 ప్రాధాన్యత పనులు చేసేందుకు రూ.2.30 కోట్లు మంజూరు చేశారు. ఇటీవల పనులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిధులతో డ్రైనేజీ, రోడ్లు, తాగునీటి సౌకర్యంతో పాటు పార్కుల అభివృద్ధి కోసం వినియోగిస్తారు.

ప్లానింగ్ సెక్రటరీలకు టీపీబీఓలుగా ఇన్‌చార్జి

కర్నూలు(న్యూసిటీ), జనవరి 10: నగర పాలక సంస్థ పరిధిలో సచివాలయంలో పని చేస్తున్న వార్డు ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలకు టౌన్ ప్లానింగ్ అండ్ బిల్డింగ్ ఓవర్‌సీర్స్(పర్యవేక్షకులు)గా ఇన్‌చార్జిలుగా నియమించారు. ఈ మేరకు టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ డైరెక్టర్ ఆర్.జే.విద్యులత ఆదేశాల మేరకు కమిషనర్ భార్గవతేజ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జిలుగా నియమితులైన సెక్రటరీలు కార్యాలయంలోని పట్టణ ప్రణాళికా విభాగంలో టీపీబీఓలుగా విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యార్హత, సీనియారిటీ, ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రతిపాదికన ఇన్‌చార్జిలుగా నియమించామని, ఎలాంటి అదనపు జీతాలు ఉండవని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో వచ్చే పదోన్నతులకు ఈ సర్వీసు ఏవిధంగా ఉపయోగపడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

కర్నూలు, జనవరి 10: నగర శివార్లలో డోన్ రహదారిలో వెంగన్నబావి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సవారమ్మ అనే వృద్ధురాలు మృతి చెందింది. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన సవారమ్మ కర్నూలుకు వచ్చేందుకు వెంగన్నబావి వద్ద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన ఆమెను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొడుకు తిమ్మప్ప ఫిర్యాదు మేరకు తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సవారమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు.

బైకు చోరీ

కర్నూలు, జనవరి 10: నగరంలోని నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో కల్లూరు చెన్నమ్మ సర్కిల్ సమీపంలో గౌస్‌బాషాకు చెందిన బైకు చోరీకి గురైంది. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన గౌస్ బాషా చెన్నమ్మ సర్కిల్ సమీపంలో చికెన్ దుకాణం నిర్వహిస్తున్నాడు. గత నెల 31వ తేదీన తన చికెన్ దుకాణం సమీపంలో బైకును నిలిపి తన పనిలో నిమగ్నమయ్యాడు. కొద్దిసేపటి తర్వాత చూస్తే బైకు కనిపించలేదు. బాధితుడు అంతటా గాలించిన ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శంకరయ్య తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

కర్నూలు, జనవరి 10: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉల్చాల జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఎల్లయ్య అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుంచి ఐదు తెలంగాణ మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

బీసీల ఐక్యత చాటాలి: టీజీ భరత్

» ఘనంగా జయహో బీసీ సదస్సు

కర్నూలు(అర్బన్), జనవరి 10: కర్నూలు నగరంలోని వాడవాడలా ఉన్న బీసీల ఐక్యతను చాటడానికి కృషి చేయాలని టీడీపీ కర్నూలు ఇన్‌చార్జి టీజీ భరత్ అన్నారు. బుధవారం నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో జయహో బీసీ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జయహో బీసీ బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి బీసీలు వెన్నెముక వంటి వారిని, పార్టీ ఆవిర్భావం నుంచి బీసీలకు తగిన గుర్తింపు ఉందన్నారు. టీడీపీ హయంలో బీసీలకు జరిగిన మేలుతో పాటు ప్రస్తుతం బీసీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని సూచించారు. తమ ప్రభుత్వం ఉన్నప్పుడు బీసీలకు స్వయం ఉపాధి రుణాలు, చేతి వృత్తులకు ఆదరణ పథకం కింద రాయితీపై పరికరాలు అందించినట్లు గుర్తు చేశారు. బీసీలు బలహీనులు కాదని, బలవంతులన్నదే తమ పార్టీ సిద్ధాంతమని టీజీ భరత్ అన్నారు. కర్నూలులో ఉన్న బీసీలందరూ ఏకం కావాల్సిన సమయంలో అసన్నమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగేశ్వరరావు యాదవ్, నియోజకవర్గ పరిశీలకుడు శ్రీనివాసమూర్తి, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న టీజీ భరత్

గూడూరులో పర్యటించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి

గూడూరు, జనవరి 10: కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎస్‌పీ సింగ్ భాగేల్ గూడూరులో బుధవారం పర్యటించారు. ఆయనకు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ నాయుడు పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం గ్రామ వికాస సమితి జిల్లా సంయోజక్ దమాం సురేష్ ఇంట్లో మంత్రికి అల్పాహారం ఏర్పాటు చేశారు. బీజేపీ మున్సిపల్ కౌన్సిలర్ దమాం శకుంతలా బాయ్‌తో మంత్రి కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోరంట్ల, పోన్నకల్ వెంకటేష్, బలరాం, హరి, ఆనంద్ పాల్గొన్నారు.

మంత్రికి అంగన్‌వాడీల వినతి: కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ భాగేల్‌కు అంగన్‌వాడీలు వినతి పత్రం అందజేశారు. బుధవారం గూడూరులో పర్యటించిన మంత్రిని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు విజయ కుమారి కలిశారు. అంగన్‌వాడీల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా జె మోహన్, విజయ కుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని గత 30 రోజులుగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాలు సుజాత, సలోని, ప్రశాంతి, లక్ష్మీ, రామలక్ష్మీ, మహేశ్వరి, రాజేశ్వరి పాల్గొన్నారు.

● మున్సిపల్ కార్మికుల సమస్యలను మీరైనా జోక్యం చేసుకోని రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి వెంటనే పరిష్కరించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్‌కు వినతి పత్రం సమర్పించినట్లు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్ తెలిపారు. బుధవారం గూడూరులో పర్యటించిన మంత్రిని కలిసి సీఐటీయూ డివిజన్ కార్యదర్శి జె మోహన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శాంతన్నల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు వినతి పత్రం సమర్పించారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సూర్యశేఖర్, వెంకటేశ్వరమ్మ, లక్ష్మీదేవి, గోపాల్, గుంతన్న, అచ్చమ్మ, దుర్గ పాల్గొన్నారు.


గూడూరులో పర్యటిస్తున్న మంత్రి ఎస్‌పీ సింగ్ భాగేల్

జాబ్ క్యాలెండర్ పేరుతో మోసం

» సీఎంపై కేసు నమోదు చేయండి: టీడీపీ


పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

కర్నూలు(అర్బన్), జనవరి 10: ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఉద్యోగాలను భర్తీ చేస్తామని మోసం చేసిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలుగు యువత నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలుగు యువత పార్లమెంట్ అధ్యక్షుడు ఎస్. అబ్బాస్ మాట్లాడుతూ జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి ఒక్క ఉద్యోగం కూడా భర్తీ చేయలేదని అన్నారు. దీంతో యువత భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ

సి.బెళగల్, జనవరి 10: మండలంలోని పోలకల్లు, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. డీఎస్పీ వెంట ఎస్ఐ మన్మధవిజయ్, పోలీసులు ఉన్నారు.

కేఈ ప్రభాకర్‌కు అయోధ్య అక్షింతలు అందజేత

కర్నూలు(కల్చరల్), జనవరి 10: అయోధ్య రామమందిరంలో శ్రీరామునిచే పూజలు అందుకున్న అక్షింతలు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేపట్టారు. ఇందులో భాగంగా బుధవారం నగరంలోని ఎస్ఆర్ పేటలోగల మాజీ మంత్రి, టీడీపీ నేత కేఈ ప్రభాకర్ దంపతులకు అందజేశారు. అలాగే సంకల్‌భాగ్‌లోని టీడీపీ నేత సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు నందిరెడ్డి సాయిరెడ్డి, ప్రాంత కోశాధికారి సండడి మహేష్, జిల్లా కోశాధికారి శ్రీనివాసరెడ్డి, ఈపూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


కేఈ ప్రభాకర్‌కు అక్షింతలు అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

కొనసాగుతున్న క్లాప్ డ్రైవర్ల సమ్మె

కర్నూలు(న్యూసిటీ), జనవరి 10: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్పొరేషన్ ఎదుట క్లాప్ డ్రైవర్లు చేస్తున్న సమ్మె బుధవారానికి 25వ రోజుకి చేరింది. ఈసందర్భంగా సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు మాట్లాడుతూ తమ డిమాండ్ల పరిష్కరించాలని గత కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రెడ్డి ఏజెన్సీ కార్మికులకు గత 12 నెలలుగా జీతాలు ఇవ్వకుండా కడుపులు మాడుస్తుంటే వైసీపీ ప్రభుత్వం ఏమి చేస్తుందని ప్రశ్నించారు.

● అక్రమ అరెస్టులను ఖండిస్తున్నట్లు డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అన్నారు. సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ విడుదల చేయాలని శాంతియుతంగా తాడేపల్లిలోని సీఎం కార్యాలయానికి వెళ్తున్న డీవైఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని తాము ఖండిస్తున్నామన్నారు. ప్రతి ఏడాది జాబ్ క్యాలెండర్, రాష్ట్రంలో ఖాళీపోస్టుల భర్తీ, మెగా డీఎస్సీ విడుదల చేస్తానని నమ్మబలికి సీఎం నిరుద్యోగులను మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేసారు. ఈసమావేశంలో ప్రకాష్, అంజి, రవి, ఎర్రమల పాల్గొన్నారు.


సమ్మె చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

లక్ష్య సాధనలో సంస్థల పాత్ర కీలకం: డీఎల్‌పీఓ

కర్నూలు(న్యూసిటీ), జనవరి 10: లక్ష్యాలను సాధించడంలో పంచాయ తీరాజ్ సంస్థల కీలకపాత్ర వహించాలని డివిజనల్ పంచాయతీ అధికారి (డీఎల్‌పీఓ) తిమ్మక్క అన్నారు. పీఆర్ అండ్ ఆర్‌డీ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ఎంపీడీఓ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు, ఈఓఆర్‌డీ, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2024-25కు సంబంధించి రెండు రోజులు శిక్షణ ఇచ్చారు. జడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో బుధవారం చివరి రోజు శిక్షణ కార్యక్రమానికి డీఎల్‌పీఓ హాజరై మాట్లాడుతూ స్థానిక సంస్థలు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రణాళికలను రూపొందించుకోవాలన్నారు. జీఎంఎస్ నెంబరు 20 ద్వారా 15వ ఆర్థిక సంఘానికి సంబంధించి ట్రైడ్ గ్రాంట్ 60 శాతం నిధుల్లో 30 శాతం తాగునీటికి, 30 శాతం పారిశుద్యానికి అన్‌టైడ్ 40 శాతం నిధుల్లో ఎంపిక చేసుకున్న థీమ్‌కు 25 శాతం కేటాయించాలన్నారు. గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా ప్రతి గ్రామ పంచాయతీ 2024-25 ప్రణాళికలను ఈ-గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ శిక్షణ మేనేజర్లు జేమ్స్, కృపారం, జడ్పీ ఏఓ జితేంద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ తిమ్మక్క

ఉల్లి ధర పతనం

ఆందోళనలో రైతులు

కర్నూలు(అగ్రికల్చర్), జనవరి 10: ఉల్లి ధర పతనం అవుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల క్వింటం ఉల్లి రూ.4 వేలకు పైగా ధర పలికింది. బుధవారం కర్నూలు మార్కెట్ యార్డులో క్వింటం ఉల్లి గరిష్ఠం గా రూ.1659, మధ్యస్థ ధర రూ.1163 కనిష్ఠ ధర రూ.301కి పడిపోయింది. పండుగ సమయంలో ధర బాగా అందుతుందనే ఆశతో ఉమ్మడి జిల్లా నలు మూలల నుంచి సుమారు 4627 క్వింటాళ్ల ఉల్లిని రైతులు విక్రయానికి తెచ్చారు. అయితే వ్యాపారులు సిండికేటుగా మారి ధరను తగ్గించారు. అమ్మకానికి 15 మంది వ్యాపారులు లైసెన్సు తీసుకోగా కేవలం ఐదుగురు మాత్రమే ఉల్లిని కొనుగోలు చేస్తున్నారు. విక్రయానికి ముందుకు రాని వ్యాపారులపై అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోక పోవడం దారుణమని రైతులు ఆరోపిస్తున్నారు.


కర్నూలు యార్డుకు రైతులు అమ్మకానికి తెచ్చిన ఉల్లి

ఎస్ఎస్ఏ ఉద్యోగులపై నిర్లక్ష్యం


రెండు నిమిషాలు మౌనం పాటిస్తున్న ఎస్ఎస్ఏ ఉద్యోగులు

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 10: రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులపై తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఆ సంఘం జేఏసీ నాయకులు ఆరోపించారు. బుధవారం స్థానిక ధర్నా చౌక్ వద్ద ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె కొనసాగుతోంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్ మోహన్ రెడ్డి ఉద్యోగులకు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించారన్నారు. కాంట్రాక్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, తాత్కాలిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆపరేటర్ వాసుదేవరావు మృతికి సానుభూతిని తెలిపి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. గౌరవ అధ్యక్షులు నాగేశ్వరరావు, చంద్రశేఖర్ రాజు, రంగన్న, రఫీ, రమణ, వెంకటరాముడు, మధు, శాంతి పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు రూ.5 వేల పెన్షన్ ఇవ్వాలి


బహుమతులు అందజేస్తున్న టీడీపీ నాయకులు

కల్లూరు, జనవరి 10: డప్పు కళాకారులకు రూ.5వేలు పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం పెద్దపాడులో చేపట్టిన డప్పు సాంస్కృతిక ఉత్సవాలకు ముఖ్య అతిథిగా 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి రెడ్డిగారి తిరుమలేశ్వరరెడ్డి హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పు కళను ఎంచుకున్న దళితులు నేటికీ వివక్షకు గురవుతున్నారన్నారు. దళితులకు 2 ఎకరాల భూమి, బస్సు ప్రయాణాల్లో రాయితీ, ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన జట్లకు ఆర్.తిరుమలేశ్వరరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.చక్రపాణి, డప్పు కళాకారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మద్దిలేటి, కరుణాకర్, కృష్ణ, గురుస్వామి, భాస్కర్, బతుకన్న, రమణ, వెంకటేశ్వర్లు, రామాంజనేయులు పాల్గొన్నారు.

నారా భువనేశ్వరికి ఘనంగా వీడ్కోలు


ఓర్వకల్లు ఎయిర్ పోర్టులో నారా భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ

ఓర్వకల్లు, జనవరి 10: కర్నూలు జిల్లా పర్యటనలో భాగంగా ఎమ్మిగనూరులో టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలని కార్యక్రమాన్ని ముగించుకుని రోడ్డు మార్గన ఓర్వకల్లు విమానాశ్రయానికి బుధవారం చేరుకున్నారు. గత రెండు రోజులుగా మంత్రాలయం, ఆదోని, ఎమ్మిగనూరు తదితర ప్రాంతాలలో చంద్రబాబు అరెస్టు జీర్ణించుకోలేక మృతి చెందిన టీడీపీ కార్యకర్తల కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించారు. విమానాశ్రయంలో ఆమెకు మాజీ ఎమ్మెల్యేలు గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, మంత్రాలయం, ఆదోని టీడీపీ ఇన్‌చార్జిలు తిక్కారెడ్డి, మీనాక్షీనాయుడు, నాయకులు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి పుష్పగుచ్చాలు ఇచ్చి ఘనంగా వీడ్కోలు పలికారు.

22న సీతారాముల పట్టాభిషేకం


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ధార్మిక సంస్థల ప్రతినిధులు

కర్నూలు(కల్చరల్), జనవరి 10: అయోధ్యలో ఈనెల 22న బాలరాముని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నగరంలో అదే రోజున సీతారాముల వారి శోభాయాత్ర, పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఉత్సవ సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ మోక్షేశ్వరుడు, అధ్యక్షుడు కె. కృష్ణన్న తెలిపారు. బుధవారం నగరంలో సి.క్యాంపులోని టీజీవీ కళాక్షేత్రంలో పట్టాభిషేక మహోత్సవ కార్యక్రమాలను వివరించే పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షులు ఎస్వీ నారాయణరెడ్డి, మహాబలేష్, ప్రధాన కార్యదర్శి నాగోజీరావు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అయోధ్యలో రామమందిరం ప్రారంభం ఐదు వందల ఏళ్ల నాటి హిందువుల కల అన్నారు.

కళాశాల అభివృద్ధికి కృషి చేయాలి

» క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సాయి గోపాల్


మాట్లాడుతున్న సాయి గోపాల్

కర్నూలు(ఎడ్యుకేషన్), జనవరి 10: కళాశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సాయి గోపాల్ అన్నారు. బుధవారం స్థానిక కేవీఆర్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో స్నాతకోత్సవ వేడుకలు ప్రిన్సిపాల్ జి.లాలెప్ప అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ లాలెప్ప మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థి అత్యధిక మార్కులు తెచ్చుకొని విట్ సంస్థలో సీటును సాధించిందన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డీవీఈఓ జమీర్ పాషా, ఆర్ఐఓ గురువయ్యశెట్టి, కొట్టె చెన్నయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దాం

సి.బెళగల్, జనవరి 10: అంబేడ్కర్ ఆశయాలను నెరవేరుద్దామని మండల ప్రత్యేక అధికారి శ్యామల అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఆమె పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో ఈనెల 19న 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పొగాకు సాగుపై అవగాహన పెంచుకోవాలి

ఓర్వకల్లు, జనవరి 10: పొగాకు పంట సాగుపై రైతులు అవగాహన పెంచుకోవాలని మేనేజర్ నవీన్ అన్నారు. బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామంలో ఐటీసీ కంపెనీ పొగాకు ఉత్పత్తులపై రైతులతో ముఖాముఖీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ గౌతమ్, రైతులు పాల్గొన్నారు.

గుమ్మనూరుకు షాక్..!



- మంత్రికి ఆలూరు టికెట్ నిరాకరణ
- సీఎం జగన్‌ను కలిసిన తరువాత మారిన సమీకరణలు
- వైసీపీ అభ్యర్థిగా చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి
- మంత్రి జయరామ్‌కు కర్నూలు ఎంపీ టికెట్
- నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం
- బీసీ మహిళ కప్పట్రాళ్ల బొజ్జమ్మకు మొండిచేయి



మంత్రి జయరాం



విరుపాక్షి



కపట్రాళ్ల బొజ్జమ్మ

కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆలూరు నియోజకవర్గ రాజకీయాలు ఆసక్తికరంగా మారాయి. వైసీపీ టికెట్ కోసం స్థానిక ఎమ్మెల్యే మంత్రి గుమ్మనూరు జయరాం సహా పలువురు పోటీ పడ్డారు. అయితే ఆలూరు వైసీపీ సమన్వయకర్త (రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి)గా చిప్పగిరి జడ్పీటీసీ సభ్యుడు బి. విరుపాక్షిని సీఎం జగన్ ఎంపిక చేశారు. మూడు పర్యాయాలు ఎమ్మెల్యేగా పోటీ చేసి రెండు సార్లు విజయం సాధించిన గుమ్మగనూరును ఆలూరు బరి నుంచి తప్పించారు. ఇది ఆయన వర్గీయులకు మింగుడు పడటం లేదు. 'బొజ్జమ్మ తల్లీ ఎలా ఉన్నావ్.. ఇన్నాళ్లకు వచ్చావు.. ఆలూరు చూసుకో తల్లి..' అంటూ ఆప్యాయంగా పలకరించి టికెట్ ఇస్తామని నమ్మించి చివరికు సీఎం జగన్ నయవంచన చేయడంతో కప్పట్రాళ్ల బొజ్జమ్మ వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. బుధవారం విజయవాడలో తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీసులో సీఎం జగన్‌ను మంత్రి గుమ్మనూరు జయరాం, జడ్పీటీసీ సభ్యుడు విరుపాక్షి కలిశారు. ఆలూరు నియోజకర్గం ఎమ్మెల్యే టికెట్ విరుపాక్షికి, కర్నూలు ఎంపీ టికెట్ జయరాంకు ఇస్తున్నాం.. ఇద్దరు కలసి సమన్వయనంతో పని చేసుకోమని చెప్పి పంపించినట్లు విశ్వసనీయ సమాచారం. వారితో తక్కువ సమయమే మాట్లాడినా ఇద్దరికీ టికెట్లపై స్పష్టత ఇచ్చి పంపించారు. మంగళవారం ఉదయమే తాడేపల్లికి రావాలని మంత్రి జయరాం, విరుపాక్షిలకు పిలుపువచ్చింది. బుధవారం సాయంత్రం 4 గంటలకు సీఎం జగన్‌ను కలిశారు. అయితే తాడేపల్లి నుంచి పిలుపు రాగానే మంత్రి వర్గీయులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మంత్రి జయరాం లేదా ఆయన తనయుడు ఈశ్వర్‌కు టికెట్ ఇవ్వాలని, కాదని ఎవరికి ఇచ్చినా పని చేయమంటూ ధిక్కారస్వరం వినిపించినా ఫలితం లేకుండాపోయింది. టికెట్ రేసులో విరుపాక్షినే పైచేయి సాధించారు. నేడు అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

● విరూపాక్షి వర్సెస్ జయరాం

మంత్రి జయరాం, జడ్పీటీసీ సభ్యుడు బి. విరుపాక్షి ఇద్దరికి చిప్పగిరి మండలమే. అదే మండలం నుంచి జడ్పీటీసీగా విజయం సాధించి.. ఆ తరువాత ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే స్థాయికి ఎదిగిన వారే. 2014, 2019 రెండు ఎన్నికల్లోనూ జయరాం గెలుపు కోసం విరుపాక్షి పని చేశారు. 2021లో స్థానిక సంస్థల ఎన్నికల్లో చిప్పగిరి జడ్పీటీసీగా పోటీ చేసి విరుపాక్షి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విరుపాక్షి రాజకీయంగా ఎదుగుతాడనో ఎక్కడ తనకు పోటీ అవుతాడనే భయమో.. తెలియదు కాని చిప్పగిరి వైసీపీ కన్వీనర్‌గా తన తమ్ముడు గుమ్మనూరు నారాయణస్వామికి ఎంపిక చేసి అధికార పెత్తనం అంతా ఆయన చేతిలో పెట్టాడు మంత్రి జయరాం. జడ్పీటీసీ సభ్యుడుగా ఉన్న విరుపాక్షిని మండలంలో జరిగే అధికార కార్యక్రమాలకు సైతం ఆహ్వానం ఉండేది కాదు. ఇద్దరి మధ్య రాజకీయ వైరం తారాస్థాయికి చేరింది. విరుపాక్షి వర్గీయులపై దాడులు కూడా చేశారని అంటున్నారు. రాజకీయ వేధింపులు తట్టుకోలేని విరుపాక్షి నేనేందుకు ఎమ్మెల్యేగా పోటీ చేయకూడదు..? అనే అభిప్రాయానికి వచ్చారు. గతేడాది ఫిబ్రవరిలో వైసీపీకి రాజీనామా చేయాలనే ఆలోచన కూడా చేశారు. ఆ సమయంలో ప్రభుత్వ సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, వైసీపీ రీజినల్ ఇన్‌చార్జిలు రాంసుబ్బారెడ్డి, కడప జడ్పీ చైర్మన్ ఆకేపోగు అమర్నాథరెడ్డి విరుపాక్షిని పిలిపించి మాట్లాడారు. ఆ రోజు నుంచి అధిష్టానంతో పరిచయాలు పెంచుకున్న ఆయన వ్యూహాత్మకంగా పావులు కదిపారు. చివరికి రాజకీయంగా తనను తొక్కేయాలని చూసిన వైరివర్గీయులనే తొక్కేసి ఎమ్మెల్యే టికెట్ సాధించారు. మంత్రి జయరాంతో రాజకీయ వైరం విరుపాక్షికి కలిసొచ్చిందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అయితే.. ఎన్నికల్లో విరుపాక్షికి మంత్రి వర్గీయులు సహకరిస్తారా..? లేదా అన్నది వేచి చూడాల్సిందే.

● బొజ్జమ్మను నమ్మించి వంచించిన జగన్

మాజీ జడ్పీటీసీ సభ్యురాలు కప్పట్రాళ్ల బొజ్జమ్మకు టీడీపీలో సీనియర్ నాయకురాలిగా గుర్తింపు ఉండేది. ఆలూరు టీడీపీ టికెట్ కోసం కూడా ఆమె ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. దివంగత టీడీపీ నేత కప్పట్రాళ్ల వెంకటప్ప నాయుడు కుమార్తెగా గ్రామాల్లో గుర్తింపు ఉంది. అదే సమయంలో మంత్రి గుమ్మనూరు జయరాంకు ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత దృష్ట్యా రాబోయే ఎన్నికల్లో టికెట్ ఇచ్చేది లేదని ఆరు నెలల క్రితమే జగన్ స్పష్టత ఇచ్చారు. ఈ క్రమంలో వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన టీడీపీ నాయకురాలు బొజ్జమ్మను వైసీపీలోకి లాగేందుకు ఎత్తులు వేశారు. వైసీపీ తరఫున పని చేస్తున్న ఐప్యాక్ టీం బొజ్జమ్మ ఇంటికి వెళ్లి పలుమార్లు చర్చలు జరిపారు. వైసీపీ అధిష్టానం పెద్దలు, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడించారు. చివరికి జగన్ దృష్టికి తీసుకెళ్లి టికెట్ ఖాయం అని నమ్మించారు. జూన్ 19న తాడేపల్లి సీఎం క్యాంప్ ఆఫీసుకు పిలిపించారు. ఆమె మెడలో వైసీపీ కండువా వేసి ఆహ్వానించాడు. అదే వేదికపై ఉన్న మంత్రి గుమ్మనూరుతో 'బొజ్జమ్మ ఆలూరు చూసుకుంటుంది.. నీవు కర్నూలు చూసుకో..' అని సీఎం జగన్ చెప్పడమే కాకుండా బొజ్జమ్మ, ఆమె భర్త మాజీ ఎంపీపీ రామచంద్రనాయుడుకు బందోబస్తు కల్పిస్తూ గన్‌మెన్లను కేటాయించారు. బొజ్జమ్మకే వైసీపీ టికెట్ అని అందరు భావించారు. జగన్ తియ్యటి మాటలు వెనుక విషం దాగి ఉందని తెలిశాక బొజ్జమ్మ వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం జగన్ నయవంచన చేశారని ఆవేదన చెందుతున్నారు. ఈ నెల 5న సీఎం జగన్‌కు బొజ్జమ్మ, జయరాం కలిశారు. ఆ సమయంలో మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని చెప్పిన ముఖ్యమంత్రి మోసం చేశాడని బొజ్జమ్మ వర్గీయులు ఆగ్రహంతో రగిలిపోతున్నారు. బీసీ మహిళలకు జగన్ ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ఆలూరు నియోజకవర్గంలో ఇది చర్చనీయాంశమైంది.

మల్లన్న సన్నిధిలో అంచనాల కమిటీ చైర్‌పర్సన్

- క్షేత్ర అభివృద్ధి, భక్తుల సౌకర్యాలపై సమీక్ష



సమావేశలో మాట్లాడుతున్న కళావతి

శ్రీశైలం, జనవరి 10: శ్రీశైలం దేవస్థానంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను బుధవారం రాత్రి ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ అంచనాల కమిటీ చైర్‌పర్సన్ ఎంఎవీ కళావతి సమీక్షించారు. స్థానిక భ్రమరాంబ అతిథి గృహంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు, దేవస్థానం పలు విభాగాల అధిపతులు పాల్గొన్నారు. సమావేశంలో ఆలయ ఈవో పెద్దిరాజు భక్తులకు కల్పిస్తున్న దర్శనం, వసతి, అన్నప్రసాద వితరణ, వాహనాల పార్కింగ్, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వైద్యసేవలు, గో సంరక్షణ, ఆగమ పాఠశాల నిర్వహణతోపాటు దేవస్థానంలో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి అంచనాల కమిటీ చైర్‌పర్సన్‌కు వివరించారు. ఈ సందర్భంగా అంచనాల కమిటీ చైర్‌పర్సన్ ఎంఎవీ కళావతి మాట్లాడుతూ క్షేత్రాన్ని సందర్శించే మల్లన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలన్నారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు, ఉగాది మహోత్సవాలు, మొదలైన పర్వదిన రోజులలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో భక్తుల సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సమావేశానంతరం అంచనాల కమిటీ చైర్‌పర్సన్ స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అంతకముందు శ్రీశైలం చేరుకున్న ఆమెకు ఆలయ కార్యనిర్వహణాధికారి డి. పెద్దిరాజు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

ద్విచక్ర వాహనం బోల్తా పడి వ్యక్తి మృతి

మంత్రాలయం, జనవరి 10: మండలంలోని మాధవరం చెక్‌పోస్టు సమీపంలో ద్విచక్ర వాహనం బుధవారం రాత్రి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మంత్రాలయం రాఘవేంద్రపురానికి చెందిన వడ్డె శేఖర్(28) అనే వ్యక్తి మృతి చెందాడు. శేఖర్ బేల్దార్ పని ముగించుకొని కర్ణాటక నుంచి సొంత గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా రాయచూర్ రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద బోల్తా పడింది. దీంతో శేఖర్‌కు తలకు దెబ్బతినడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య గాయత్రి కొడుకు, కూతురు ఉన్నారు. మాధవరం ఎస్ఐ కిరణ్ బాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతుని వద్ద ఉన్న సెల్‌ఫోన్ ఆధారంగా కుటుంబానికి సమాచారం అందించారు. శేఖర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

కాల్ మనీ ఆత్మహత్య

- అప్పు, వడ్డీ చెల్లించాలని బెదిరించిన వైసీపీ మాజీ కౌన్సిలర్
- సెల్ఫీ వీడియో తీసుకుని రైలు కిందపడి బలవన్మరణం



మృతి చెందిన హరికృష్ణ

నంద్యాల క్రైం, జనవరి 10 : నంద్యాల పట్టణంలో కాల్ మనీకి యువకుడు బలయ్యాడు. రూ.10 వడ్డీకి అప్పు ఇచ్చిన మహిళ తీవ్రస్థాయిలో వేధించడంతో భరించలేక రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియోలో బాధితుడి మాటలు సోషల్ మీడియా లో చర్చనీయాంశమయ్యాయి. నంద్యాల నూనెపల్లెలోని మారుతీ నగర్‌కు చెందిన హరికృష్ణ (36) నంద్యాల మున్సిపాల్టీలో కాంట్రాక్టు పద్ధతిన పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మృతుడి భార్య ఆరేళ్ల క్రితం మరణించింది. వీరికి ఇద్దరు సంతానం. తన ఇంటి అవసరాలకు నంద్యాల వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దళితవాడకు చెందిన వైసీపీ నాయకురాలు, మాజీ కౌన్సిలర్ కన్నమ్మ వద్ద నూటికి రూ.10వడ్డీతో రూ.3 లక్షలు అప్పు తీసుకున్నాడు. ఆర్థిక పరిస్థితి సరిగాలేక మూడు నెలల నుంచి వడ్డీ చెల్లించలేకపోయాడు. అప్పు ఇచ్చిన మహిళ నిరంతరం వేధించడం, తన అనుచరులతో బెదిరించడంతో ఆత్మహత్య చేసుకుంటున్నట్లు హరికృష్ణ సెల్ఫీ వీడియోలో మాట్లాడాడు. అప్పు, వడ్డీ తప్పనిసరిగా చెల్లిస్తానని చెప్పినా బెదిరింపులకు పాల్పడటంతో చేసేదేమీలేక ఆత్మహత్య చేసుకుంటున్నానని, ఇందుకు కన్నమ్మే కారణమని వీడియోలో మాట్లాడాడు. ఆ తర్వాత మహానంది మండలం నందిపల్లె సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని ప్రభుత్వ ఆస్పత్రిలో ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా తన కొడుక్కు గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగాలేదని, అందుకే ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి వీరప్ప రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్సై జలీల్ తెలిపారు.

డిగ్రీలో ఆరుగురి డీబార్

కర్నూలు(అర్బన్), జనవరి 10: రాయలసీమ యూనివర్సిటీలో జరిగిన 1, 5 సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్. వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాలోని 16 పరీక్షా కేంద్రాల్లో 1వ సెమిస్టర్లో 5941కి 5368, 5వ సెమిస్టర్‌కు 5778 మంది దరఖాస్తు చేసుకోగా 5313 మంది పరీక్షలకు హాజరై పరీక్షలు రాశారని పేర్కొన్నారు.

రేపటి నుంచి శ్రీశైలంలో

సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

ఆర్జిత సేవలు నిలుపుదల



విద్యుద్దీపాలంకరణలో శ్రీశైలం ఆలయం

శ్రీశైలం, జనవరి 10: శ్రీశైల మహాక్షేత్రంలో మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఈ నెల 12 నుంచి 18 వ తేదీ వరకు సంక్రాంతి బ్రహ్మోత్సవాలను దేవస్థానం వైభవంగా నిర్వహించనుంది. ఏడురోజులపాటు ఈ బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. సంక్రాంతి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆయా ఏర్పాట్లను పూర్తిచేశారు. 12వ తేదీ శుక్రవారం ఉదయం 8:30 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 13వ తేదీన భృంగివాహనసేవ, 14న రావణవాహనసేవ, 15వ తేదీ మకరసంక్రాంతి పర్వదినం రోజున నందివాహనసేవ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం, 16న కైలాసవాహనసేవ, 17న యాగపూర్ణాహుతి, కలశోద్వాసన, త్రిశూలస్నానం, సదస్యం, నాగవల్లి, ధ్వజావరోణ కార్యక్రమాలు, 18న తేదీన రాత్రి జరిగే పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా ఈ నెల 12 నుంచి 18 వరకు ఆర్జిత, ప్రత్యక్ష, పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామి, అమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలను నిలుపుదల చేశారు.

వైసీపీకి షాక్

- పార్టీకి ఎంపీ సంజీవకుమార్ రాజీనామా
- మరోసారి టికెట్ ఇవ్వకపోవడంతో నిరాశ



కర్నూలు, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న వేళ వైసీపీకి ఊహించని షాక్ తగిలింది. బీసీలలో బలమైన చేనేత సామాజిక వర్గానికి చెందిన కర్నూలు వైసీపీ ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవకుమార్ ఆ పార్టీకి, ప్రాథమిక సభ్యత్వానికి బుధవారం రాజీనామా చేశారు. రాబోయే ఎన్నికల్లో కర్నూలు పార్లమెంట్ స్థానం నుంచి మరోసారి పోటీ చేసేందుకు ఆయన ఆసక్తి చూపారు. తన రాజకీయ భవితవ్యాన్ని తేల్చుకోవడానికి వైసీపీ అధినేత సీఎం జగన్‌ను కలిసేందుకు పలుమార్లు ప్రయత్నించారు. నెలలు గడచినా కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎంవో ఓఎస్‌డీ ధనుంజయరెడ్డిలను కలిసేందుకు చేసిన ప్రయత్నాలు కూడా విఫలమయ్యాయి. కనీసం ఫోన్ కూడా తీయకపోవడంతో మనస్తాపానికి గురైన డాక్టర్ సంజీవ కుమార్ ఆ పార్టీకి రాజీనామా చేశారు.

● తొలిసారిలోనే ఎంపీగా విజయం

కర్నూలు నగరంలో ఆయుష్మాన్‌భవ ఆస్పత్రి అధినేత అయిన డాక్టర్ సంజీవ కుమార్ 2019 ఎన్నికలకు ముందు రాజకీయాల్లోకి వచ్చారు. ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగు పెట్టారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నా ఏ ఒక్క ఎమ్మెల్యే కూడా ఆయనను ఎంపీగా గుర్తించలేదు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కావడం వల్లే ఎంపీగా గుర్తించలేదని ఆయన సన్నిహితులు ఆవేదన చెందిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ప్రభుత్వం ఎలాంటి కార్యక్రమాలు చేపట్టినా ఒక్క కర్నూలు మినహా ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లో ఎంపీగా ఆయనను ఆహ్వానించిన సందర్భాలు కూడా తక్కువే. ఇదే విషయాన్ని ఒకట్రెండు సార్లు సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా ఎమ్మెల్యేలు ఎలా చెబితే.. అలా వినాలని చెప్పినట్లు తెలుస్తోంది. అలాగే పార్లమెంట్‌లో ప్రశ్నలు అడగాలన్నా రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి అనుమతి తీసుకోవాల్సి ఉండేదని ఆయన వర్గీయులు చెబుతున్నారు. దీనికితోడు ఈ సారి మరో వ్యక్తికి టికెట్ ఇవ్వాలన్న ఆలోచనలో అధిష్టానం ఉందని తెలిసి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ మేరకు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. టీడీపీలో చేరే అవకాశాలు ఉన్నాయని సమాచారం.

సన్నిహితులతో చర్చించి భవిష్యత్తు నిర్ణయం
- డాక్టర్ సంజీవ కుమార్

ఎంపీగా గెలిచాక నాలుగున్నర ఏళ్లలో సీఎం జగన్‌ను రెండు సార్లు మాత్రమే కలిసే అవకాశం వచ్చింది. ఎంపీగా కర్నూలు పార్లమెంట్‌లో అనుకున్న అభివృద్ధి పనులు చేయలేకపోయాను. ఆ విషయాలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తే.. అభివృద్ధి పనులు ఎమ్మెల్యేలు చూసుకుంటారు.. నీకెందుకు అంటూ సమాధానం ఇచ్చారు. మరో వ్యక్తికి ఎంపీ టికెట్ ఇస్తారని తెలిసింది. పార్టీ నుంచి నాకు నేరుగా ఎలాంటి సమాచారం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీలో ఉండడం సరికాదని రాజీనామా చేశాను.

అవన్నీ కేంద్ర పథకాలే

- కేంద్ర వైద్య, ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్



మెడికల్ కాలేజీ ప్లాన్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి

ఆదోని టౌన్, జనవరి 10 : రాష్ట్రంలో అనేక పథకాలు కేంద్ర నిధులతోనే అమలవుతున్నాయని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ అన్నారు. బుధవారం ఆయన ఆదోని పట్టణంలో పర్యటించి వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. పట్టణానికి పది కిలోమీటర్ల దూరంలోని అరేకల్ గ్రామ సమీపంలో నిర్మిస్తున్న మెడికల్ కళాశాల నిర్మాణం పనులను ఆయన పరిశీలించి పనులలో నాణ్యతను పాటించాలని అధికారులకు ఆదేశించారు. పట్టణంలో నూతన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. గత నాలుగేళ్లుగా దేశ వ్యాప్తంగా పేదలకు ఉచితంగా బియ్యం సరఫరా చేయడంతో పాటు, ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందాలనే ఉద్దేశంతో ఆయుష్మాన్‌భవ పథకాన్ని అమలు చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాస్, సీనియర్ నాయకులు కునిగిరి నాగరాజు, గోవిందరాజులు గౌడ్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, కో కన్వీనర్ నాగరాజ్ గౌడ్, పట్టణం అధ్యక్షుడు సాయి, వడ్డే వెంకటేష్, ఆచారి, ఆదూరి విజయ కృష్ణ, పాల్గొన్నారు.

పథకాలను అందజేయడానికే వికసిత్ యాత్ర

హొళగుంద, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలపై ప్రజలల్లో అవగాహన కల్పించడానికే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర చేపట్టామని కేంద్ర ఆరోగ్య సహాయ మంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ అన్నారు. హొళగుంద మండలంలోని గజ్జెహళ్లి గ్రామంలో సర్పంచ్ అరుబొట్ల నాగమ్మ అధ్యక్షతన జరిగిన వికసిత్ భరత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన మాట్లాడతూ మోదీ ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి తోడ్పాటు అందిస్తున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ, జడ్పీ సీఈవో నసారా రెడ్డి, డీఆర్‌డీఏ సలీం, ఎమ్మార్వో హుస్సేన్ సాబ్, ఎంపీడీఓ సుహాసినమ్మ, ఈవోపీఆర్డీ చంద్రమౌళీశ్వర్ గౌడ్ పాల్గొన్నారు.

ఇళ్లకు వంద శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు

నందవరం /ఎమ్మిగనూరు టౌన్, జనవరి 10: రాష్ట్రంలో పేదల కోసం ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద మంజూరైన 25లక్షల గృహాలకు వందశాతం కేంద్ర ప్రభుత్వం నిధులు సమకూరుస్తుందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వాటా ఏమి లేదని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖమంత్రి సత్యపాల్ సింగ్ బాగేల్ పేర్కొన్నారు. బుధవారం వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎమ్మిగనూరు నియోజకవర్గంలో పర్యటించారు. నందవరంలో ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ దేశంలోని పేద ప్రజల సంక్షేమం కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని, వాటిని సద్వినియోగం చేసుకొని అభివృద్ధిలోకి రావాలని అన్నారు. మరుగుదొడ్లు, బియ్యం, గోధుమలు వంటివి కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్నదని అన్నారు. జన్‌ధన్ కింద బ్యాంకుల్లో అకౌంట్లు ఉన్నందు వల్ల 55కోట్ల మంది ఖాతాల్లో నేరుగా కేంద్రప్రభుత్వం మంజూరు చేసిన పథకాల డబ్బు చేరుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కనిగిరి నీలకంఠ, కేశవస్వామి, బీఎల్ నారాయణ, కిరణ్‌కుమార్, బనవాసి రాముడు పాల్గొన్నారు.

వైసీపీ అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తాం : టీడీపీ



విలేకరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, జనవరి 10: పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి సహకారంతో ఓర్వకల్లు మండలంలో వైసీపీ నాయకులు చేసిన అక్రమాలను ఆధారాలతో నిరూపిస్తామని టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి అన్నారు. ఓర్వకల్లులో టీడీపీ మండల నాయకులు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ ఓర్వకల్లులో 1725 రేషన్ కార్డులు ఉంటే జగనన్న కాలనీలో రెండు వేల నాలుగు వందలు పట్టాలు ఎవరికి ఇచ్చారో వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. 202 సర్వే నెంబరులో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని పట్టాలు పుట్టించుకున్నారని ఆరోపించారు. టీడీపీ నాయకుడు చదువుల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ తాను వైసీపీని వీడితే తమ పంటలో ఓ చీడ పురుగు పోయిందని కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారని, నిజానికి మండలంలో చీడ పురుగు ఎవరో ప్రజలందరికీ తెలుసన్నారు. గ్రామంలో టీడీపీ హయాంలో సర్వే నెంబరు 151లోని 10 ఎకరాల భూమిలో 2 సెంట్లు చొప్పున 420 ప్లాట్లు వేసి లేఅవుట్ తయారు చేయగా 124 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని అనివార్య కారణాల వల్ల ప్లాట్లు పంపిణీ చేయలేదన్నారు. పట్టాల పంపిణీ చేయాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా కాలయాపన చేస్తున్నారన్నారు. కాల్వబుగ్గ చైర్మన్ చెన్నారెడ్డికి తనను విమర్శించే స్థాయి లేదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మోహన్ రెడ్డి నాయకులు చింతలపల్లె గ్రామ సర్పంచ్ వెంకట రమణ, టీడీపీ నాయకుడు లక్ష్మీకాంత రెడ్డి, సుధాకర్ రావు, మౌళీశ్వర రెడ్డి, రామాంజనేయులు, నాగరాజు, సుధాకర్, రామకోటేశ్వర రావు, విజయుడు, శ్రీనివాసులు, తిరుపాలు, శివుడు తదితరులు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

వలంటీర్లపై పింఛన్‌దారుల ఫిర్యాదు



ఎంపీడీఓకు ఫిర్యాదు చేస్తున్న బాపురం గ్రామ పింఛనుదారులు

కౌతాళం, జనవరి 10: కొత్తగా రూ.3 వేలు పింఛన్ పంపిణీ చేయకుండా పాత పింఛన్ ప్రకారం రూ.2750 ఇచ్చారని బాపురం గ్రామానికి చెందిన పదిహేను మంది పింఛన్‌దారులు బుధవారం ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. బాపురం పంచాయతీలో 380 వివిధ రకాల పింఛన్లు ఉన్నాయని, వృద్ధాప్య పింఛన్‌దారులకు కాకుండా మిగతా పింఛన్‌దారులకు రూ.2750 పంపిణీ చేశారని లబ్ధిదారులు చెప్పారు. వలంటీర్లను అడగ్గా.. అధికారులు రూ.2750 ప్రకారం ఇచ్చారని చెప్పారు. అయితే గ్రామ వెల్ఫేర్ అసిస్టెంట్‌ను వివరణ కోరగా రూ.3 వేల ప్రకారం ఇచ్చామని వెల్లడించారు. అయితే బయోమెట్రిక్ వేయించుకున్న తర్వాత తక్కువగా ఇవ్వడంతో డబ్బులు తీసుకోలేదని ఇద్దరు లబ్ధిదారులు తెలిపారు. టీడీపీ గ్రామ నాయకులు శివమోహన్‌రెడ్డి, వెంకటరెడ్డి పింఛనుదారులతో కలసి ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్బరాజుకు వినతి పత్రం అందజేశారు. విషయంపై ఎంపీడీఓను వివరణ కోరగా పింఛను పంపిణీలో కొందరు వలంటీర్లు నగదును పింఛనుదారులకు రూ.250 తక్కువగా ఇచ్చినట్లు ఫిర్యాదులు అందాయని, వాటిపై విచారణ చేపట్టి పింఛనుదారులకు న్యాయం చేస్తానని తెలిపారు.

రాష్ట్ర స్థాయి అండర్-17 క్రికెట్ జట్టుకు ఎంపిక

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 10: పాట్నాలో ఈనెల 16వ తేదీ నుంచి జరిగే జాతీయస్థాయి అండర్-17 క్రికెట్ పోటీలకు రాష్ట్ర జట్టు తరపున ఆదోని పట్టణానికి చెందిన యోధశంకర్ రెడ్డి ఆడనున్నారని తాలుకా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్ తెలిపారు. బుధవారం రాష్ట్ర జట్టుకి ఎంపికైన యోధ శంకర్ రెడ్డిని తాలుకా క్రికెట్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ముజీబ్, కంబిరెడ్డి, వెంకటేష్, జోనాథన్, కొల్లి రవి, జేఎం భాష, కోచ్ బాలాజీ రావు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలి

దేవనకొండ, జనవరి 10: దేవనకొండలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతి పత్రం అందజేశారు. సరైన క్రీడా ప్రాంగణం లేక యువకులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. క్రీడా ప్రాంగాణం కోసం దాదాపు ఐదు ఎకరాల స్థలం కేటాయించేలా జిల్లాయంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. ఏఐవైఎఫ్ నాయకులు రమేష్, రవి, రామాంజినేయులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సీఐగా శ్రీనివాసులు

దేవనకొండ, జనవరి 10: దేవనకొండ పోలీసు స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో సీఐని స్టేషన్‌కు సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు. కొత్త సీఐగా కుంచాల శ్రీనివాసులు బాధ్యతలు చేపట్టనున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. కర్నూలు వీఆర్ నుంచి దేవనకొండ సీఐగా త్వరలోనే బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

ఘనంగా మారికాంబదేవి దేవర

కౌతాళం, జనవరి 10: మండలంలోని గుడికంబాలి, మరళి, తిప్పలదొడ్డి గ్రామాల్లో ఆయా గ్రామ దేవత మారికాంబదేవి దేవర ఉత్సవాలు బుధవారం ఘనంగా కొనసాగాయి. ముఖ్యంగా తిప్పలదొడ్డి మారికాంబదేవికి గ్రామస్థులు, భక్తులు ఉదయం నుంచి తమ ఇండ్ల నుంచి కుంభాలతో మేళతాళాలతో బయలుదేరి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నబసప్ప, తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతిరాజు దర్శించుకున్నారు. గ్రామ నాయకుడు మల్లయ్య, నీలకంఠరెడ్డి ఉన్నారు.

ఏస్సీ కాలనీలో కొళాయి ఏర్పాటు

హొళగుంద, జనవరి 10: స్థానిక ఎస్సీ కాలనీలోని పదో వార్డులో పంచాయతీ సిబ్బంది కొళాయిని ఏర్పాటు చేశారు. ఎస్సీ కాలనీలోని కొళాయి పైపు మరమ్మతులకు గురవడంతో కొళాయి చుట్టూ మురుగు చేరి దుర్గంధం వస్తున్నా ఆ నీటి తాగుతున్నామని ఆంధ్రజ్యోతిలో ఈనెల 8న 'మురుగులోనే తాగు నీరు' అన్న శీర్షిక ప్రచురితమైంది. అందుకు స్పందించిన సర్పంచ్ పైప్ లైన్‌కు మరమ్మ తులు చేపట్టి కొళాయి ఏర్పాటు చేశారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

వజ్రోత్సవాలను జయప్రదం చేయండి

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 10: కర్నూలులో ఈనెల 12, 13 తేదీలలో జరిగే ఎస్టీయూ రాష్ట్ర వజ్రోత్సవాలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగరాజు కోరారు. బుధవారం వజ్రోత్సవాల ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగ ఉపాధ్యాయలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకటో తేదీనే జాతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న, పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

ఆదోని రూరల్, జనవరి 10: ఆదోని మండలం ఆరేకల్లు సమీపంలో అదుపు తప్పి ఆటో బోల్తా పడడంతో ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. కపటి గ్రామానికి చెందిన అక్షయ, గంగమ్మ, నాగలక్ష్మిలు సొంత పనుల నిమిత్తం బుధవారం ఆటోలో ఎమ్మిగనూరుకు బయల్దేరారు. ఆరేకల్లు సమీపంలో కుక్కలు అడ్డు రావడంతో డ్రైవర్ అదుపు చేయకపోవడంతో ఆటో బోల్తాపడింది. ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న టీడీపీ ఆదోని ఇన్‌చార్జి మీనాక్షినాయుడు క్షతగాత్రులను ఆదోని ఆసుపత్రికి తరలించారు.

పట్టాదారులకు న్యాయం చేస్తాం

కౌతాళం, జనవరి 10: ఎరిగేరి గ్రామంలో సర్వే నెంబరు 253లో ప్రభుత్వ భూమిలో గతంలో ఇళ్ళ స్థలాల కోసం ఇళ్ళ పట్టాలు ఇవ్వగా ఆ స్థలాన్ని కొందరు కబ్జా చేస్తున్నారని హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై తహసీల్దార్ రామేశ్వరరెడ్డి బుధవారం విలేకరులతో మాట్లాడుతూ సర్వే నెం 253లో ఇళ్ల స్థలాలు పొందిన వారు తమ ఒరిజినల్ పట్టాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తే వాటిని పరిశీలించి అర్హులకు స్థలం హద్దులను చూపిస్తామని తెలిపారు. కాబట్టి గ్రామ ప్రజలు రెవెన్యూ అధికారులకు సహకరించాలని కోరారు.

విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆదోని(అగ్రికల్చర్), జనవరి 10: సంక్రాంతి సెలవు దినాలలో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గౌస్ కోరారు. బుధవారం యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లోనూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. నాయకులు శశిధర్, నాగరాజు, గణేష్, సురేష్, మహేష్, పవన్, యశ్వంత్ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన నాయకులు

ఆదోని, జనవరి 10: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నిజం గెలవాలి పేరుతో చేస్తున్న పర్యటన బుధవారం రెండో రోజు ఆదోని నుంచి కొసాగింది. గురువారం రాత్రి ఆదోని పట్టణంలోని చేకూరి ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక వాహనంలో బస చేశారు. బుధవారం ఉదయం 9 గంటలకు ప్రత్యేక వాహనం నుంచి బయటకు వచ్చిన భువనేశ్వరి అక్కడే ఉన్న మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మంత్రాలయం ఇన్‌చార్జి తిక్కారెడ్డి, బత్తిన లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. మీనాక్షి నాయుడు సతీమణి సులోచనమ్మ తెచ్చిన సారె, పసుపు, కుంకుమ అందజేసి తమ ఇంటి ఆడపడుచూలా ఆదరించారు. అనంతరం వేలాదిగా వచ్చిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అక్కడికి పెద్ద సంఖ్యలో చేరుకున్న మహిళలకు అభివాదం చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న టీడీపీ నాయకులు మదిరె భాస్కర్ రెడ్డి, దేవేంద్రప్ప, గుడిసె కృష్ణమ్మ, గుడిసె శ్రీరాములు, ఆలూరు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్, బత్తిన కుబేర్నాథ్, బత్తిన ధనంజయుడు, బంగారు సుధాకర్, మధు పుష్పగుచ్ఛాలు అందజేశారు. అనంతరం చంద్రబాబు అరెస్టు సమయంలో ఆందోళనకు గురై మరణించిన కార్యకర్తల కుటుంబాలకు పరా మర్శించడానికి బయలుదేరి వెళ్లారు.

చంద్రబాబును సీఎంగా చూడడమే ప్రధాన లక్ష్యం: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడటమే ప్రధాన లక్ష్యమని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నాయకులు మారుతి నాయుడు అన్నారు. బుధవారం నిజమే గెలవాలి పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి ఆదోనిలో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. యువ నాయకుడు వినయ్ పాల్గొన్నారు.

నారా భువనేశ్వరిని కలిసిన వీరభద్ర గౌడ్

ఆలూరు: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరిని ఆలూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ మంగళవారం కలిశారు. ఆదోనిలోని చేకూరి ఫంక్షన్ హాల్‌లో బస చేసిన భువనేశ్వరిని టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి మాట్లాడారు. నియోజకవర్గంలో టీడీపీ పటిష్టతకు తీసుకుంటున్న చర్యలు, కార్యకర్తల బాగోగులపై వీరభద్ర గౌడ్ భువనేశ్వరి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా టీడీపీ ఆలూరు మాజీ ఇన్‌చార్జి వైకుంఠం శివప్రసాద్, జ్యోతి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం మల్లికార్జున, శశిసుధలు నారా భువనేశ్వరిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఎమ్మిగనూరు: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాల్లో పర్యటించిన నారా భువనేశ్వరిని తిక్కారెడ్డి కుటుంబ సభ్యులు కలిశారు. ఆదోనిలో బస చేసిన నారా భువనేశ్వరిని మంత్రాలయం ఇన్‌చార్జి పాలకుర్తి తిక్కారెడ్డి, ఆయన సతీమణి వెంకటేశ్వరమ్మ, శ్రీనివాసరెడ్డి, ఆయన సతీమణి కల్పనలు, పెద్దకడుబూరు మండల నాయకులు రమాకాంతరెడ్డి, ఆయన భార్య నరవ శశిరేఖలు కలిశారు. పర్యటనను ముగించుకొని హైదరాబాద్‌కు వెళ్తున్న ఆమెకు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో మాజీ ఎమ్మెల్యే మీనాక్షినాయుడు, మంత్రాలయం, ఎమ్మిగనూరు ఇన్‌చార్జిలు పాలకుర్తి తిక్కారెడ్డి, బీవీ జయనాగేశ్వరరెడ్డిలు, టీడీపీ నాయకులు వీడ్కోలు పలికారు.



భువనేశ్వరిని కలిసిన వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, బొకేను అందజేస్తున్న తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి

గోనెగండ్ల: ఎర్రబాడుకు చెందిన హజీరా హత్య కేసులో ఉన్న నిందితులను వదలబోమని, టీడీపీ అధికారంలోకి వచ్చి న వెంటనే హజీరా కుటుం బానికి న్యాయం చేస్తామని నారా భువనేశ్వరి అన్నారు. ఎర్రబాడులో పర్యటించిన భువనేశ్వరిని హజీరా తల్లి కలిశారు. తమ కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు.



మీనాక్షినాయుడు కుటుంబ సభ్యులతో ముచ్చటిస్తున్న నారా భువనేశ్వరి



ఆదోనిలో నారా భువనేశ్వరిని కలిసిన తిక్కారెడ్డి కుటుంబ సభ్యులు



భువనేశ్వరిని కలిసిన వీరభద్రగౌడ్

పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యం: ఆర్డీటీ డైరెక్టర్



సూగూరులో కుట్టు మిషన్లు పంపిణీ చేసిన ఆర్డీటీ డైరెక్టర్

మంత్రాలయం, జనవరి 10: గ్రామాల్లో పేదలను గుర్తించి శిక్షణ ఇచ్చి ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ఆర్డీటీ సేవలు అందిస్తోందని ఆ సంస్థ మహిళా ఎంప్లాయిమెంట్ డైరెక్టర్ విశాల ఫెర్రర్ అన్నారు. మండలంలోని సూగూరు గ్రామంలో బుధవారం రీజనల్ డైరెక్టర్ రామేశ్వరి, ఏరియా టీమ్ లీడర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో కొత్తగా 43 గృహాలు నిర్మించి ప్రారంభించి పేదలకు అందజేశారు. అదే విధంగా గత 6 నెలలుగా 27 మంది బాలికలు, మహిళలకు ఉచితంగా టైలరింగ్ నేర్పించి 27 కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విశాల ఫెర్రర్ గృహాలు ప్రారంభించి సభను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్డీటీ సీవో నరసింహులు, ఎంఅండ్ఈ వెంకటేష్, వైస్ సర్పంచ్ గోపీనాథ్, జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అనుమన్న పాల్గొన్నారు.

తలకిందులుగా పారిశుధ్య కార్మికుల నిరసన



తలకిందులుగా నిరసన వ్యక్తం చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఆదోనిలో గుంజీళ్లు తీస్తూ..

ఎమ్మిగనూరు టౌన్, జనవరి 10: మున్సిపల్ కార్మికులు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం తలకిందులుగా నిల్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు రంగన్న, రాముడు, మహేంద్ర మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించాలని 15 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవటం దారుణమన్నారు. మున్సిపల్ కార్మికుల పట్ల నిరంకుశ వైఖరి అవలంబించటం సరైంది కాదన్నారు. ఇచ్చిన వాగ్దానాలను సీఎం జగన్ వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు సమ్మెను ఆపేదిలేదన్నారు. కార్యక్రమంలో నాయకులు విజేంద్ర, ఎల్లప్ప, శివ, వీరేష్, నాగప్ప, రాము, అల్లా బకాష్, కేశన్న, రంగన్న, లక్ష్మన్న పాల్గొన్నారు.

ఆదోని టౌన్: మున్సిపల్ కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు బుధవారం భీమాస్ కూడలిలో గుంజీళ్లు తీస్తూ నిరసన తెలిపారు. ప్రభుత్వం కార్మిక సమస్యల పరిష్కారం చేయని పక్షంలో కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి ఉంటుందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజయ్‌బాబు హెచ్చరించారు. సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెను కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి వెంకన్న, జిల్లా సమితి సభ్యుడు షేక్షావలి, సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు, పట్టణ కార్యదర్శి సుదర్శన్, కార్మికుల సంఘం నాయకులు జాన్‌బాబు, శేఖర్, చిన్న ఎల్లప్ప, నామాల జయరాజ్, అర్జున్, రాజు, గుండ అంజని, ఆదిలక్ష్మి, నాగమ్మ, దేవమని, ఐసీ లక్ష్మి పాల్గొన్నారు.

సమ్మెకు ఆర్‌సీసీ మద్దతు: మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య కార్మికుల సమ్మెకు బుధవారం రాయలసీమ కో-ఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) గౌరవ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు గౌరవ వేతనంగా రూ.26వేలు మంజూరు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు కమిటీ సభ్యులు జగదీష్, భద్రీనాథ్ స్వామి, శివగౌడ్, శేఖర్ ఉన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ అడిగితే అరెస్టులా ?: డీవైఎఫ్ఐ

ఎమ్మిగనూరు, జనవరి 10: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ అడిగితే ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయటం దారుణమని డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు సురేష్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులు విడుదల చేయాలని కోరుతూ రాజధానిలో ఆందోళనకు దిగిన నిరుద్యోగ ఉపాధ్యాయులను ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయటాన్ని డీవైఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తోందని అన్నారు. ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఆలూరు రూరల్: మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని సీఎం కార్యాలయం ముట్టడికి వెళ్లిన డీవైఎఫ్ఐ నాయకులను అక్రమంగా అరె స్టులను చేయడాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం ఆలూరు అం బేడ్కర్ సర్కిల్లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీని విడుదల చేయాలన్నారు. ఈకార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సంయుక్త మండల అధ్యక్షులు గిరిమూర్తి మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నరసింహా, నాగప్ప, ధనుంజయ్, మల్లి పాల్గొన్నారు.



ఆలూరులో నిరసన తెలుపుతున్న డీవైఎఫ్ఐ నాయకులు

దేవనకొండ: నిరుద్యోగులు ఉద్యోగాల కోసం ఉద్యమాలు చేస్తుంటే ఉద్యోగాలు కల్పించాల్సింది పోయి అక్రమ అరెస్టులు చేయడం దారుణమని డీవైఎఫ్ఐ మండల కార్యదర్శి శ్రీనివాసులు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లుగా ఒక్క డీఎస్సీ నోటిఫికేషన్ వదలకపోవడంతో నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడిన జగన్‌కు వచ్చే ఎన్నికలలో ఓటమి తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రసూల్ ,రంగస్వామి ,వీరేంద్ర ,వీరప్ప ,మురళి,సూర్యచంద్ర తదితరులు ఉన్నారు.

వ్యాపారుల సిండికేట్

▸ పెరవలి రంగనాథస్వామి తలనీలాల వేలం మూడోసారి వాయిదా



వేలం పాటలు నిర్వహిస్తున్న అధికారులు

మద్దికెర, జనవరి 10: మండల పరిధిలోని పెరవలిలో రంగనాథ స్వామి దేవాలయ వెంట్రుకల వేలం పాట ముచ్చటగా మూడోసారి వాయిదా పడింది. వేలం పాటలు పాడేందుకు వచ్చిన వ్యాపారులు సిండికేట్‌గా మారి గత ఏడాదికంటే తక్కువ ధరకు వేలం పాడటంతో ఆలయ ఆదాయానికి గండిపడకుండా దేవదాయశాఖ ఈ నెల 17కు వేలాలను వాయిదా వేసింది. దేవాలయం తలనీలాల వేలంపాటలు గత ఏడాది రూ 16 లక్షలకు వేలం ద్వారా దక్కించుకున్నారు. ఈ ఏడాది వేలంపాటలు గత నెలలో మొదటిసారి నిర్వహించగా నలుగురు పాటదారులు భయానాచెల్లించి వేలంలో పాల్గొన్నారు. రూ 9లక్షల 50వేలకు వేలంపాట నిలిచిపోవడంతో గత ఏడాదికంటే తక్కువపాటకు తలనీలాల హక్కులు ఇవ్వలేమని దేవదాయశాఖ వాయిదావేసింది. రెండోసారి మరింత తక్కువగా 8లక్షలకే పాట నిలిచిపోవడంతో జనవరి 10కి వేలం వాయిదావేశారు. బుధవారం జరిగిన వేలం పాటలో సైతం గతంలో పాల్గొన్న నలుగురు పాటదారులే బయానాచెల్లించి పాటలో పాల్గొన్నారు. రూ 8లక్షల 50 వేలకు పాటను నిలిపివేశారు. దీంతో మరోమారు దేవాదాయశాఖ అధిరులు పాటను ఈనెల 17కు వాయిదావేశారు. ప్రతిఏటా తలనీలాల వేలంపాటలు పెరుగుతూ దేవాలయానికి ఆదాయం పెరుగుతూ వస్తోందని, ఈఏడాది పాటదారులు సిండికేట్‌గా మారి దేవాలయ ఆదాయానికి గండికొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు వాపోయారు. 17 న జరిగే వేలంపాటలకు వేరేప్రాంతాల పాటదారులకు సమాచారం ఇచ్చి సిండికేట్ గ్యాంగ్ ఆటకట్టించేందుకు దేవదాయశాఖ అధికారులు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

మురవణిలో గంజాయి సాగు?

పెద్దకడుబూరు, జనవరి 10: మండలంలోని మురవణి గ్రామంలో గంజాయి సాగు చేసినట్లు సమచారం రావడం కలకలం రేపుతోంది. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన పంట పొలంలో గుట్టు చప్పుడు కాకుండా గంజాయి సాగు చేస్తున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఎమ్మిగనూరు పట్టణంలోని గంజాయి విక్రయాలపై నిఘా పెట్టిన పట్టణ పోలీసులు గంజాయి అమ్మకం సాగిస్తున్న వ్యక్తి ద్వారా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి వివరాలను తెలుసుకున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగానే రెండు రోజులు క్రితం మురవణిలో గంజాయి సాగు చేస్తున్న వ్యక్తిపై నిఘా ఉంచి అదుపులోకి తీసుకొని ఎమ్మిగనూరు డీఎస్పీ కార్యాలయానికి తరలించి విచారిస్తున్నట్లు సమాచారం. పెద్దకడబూరు ఎస్ఐ మహేష్ కూమారును వివరణ కోరగా ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని చెప్పారు

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

మద్దికెర, జనవరి 10: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు మూలింటి రంగస్వామి, శ్రీరాములు అన్నారు. మండల పరిధిలోని పెరవలి గ్రామంలో బుధవారం భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగి టీడీపీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఒక్క ఛాన్స్‌పేరిట అధికారం చేపట్టిన జగన్ రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చాడన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన

ఆలూరు రూరల్, జనవరి 10: తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం చేస్తున్న అంగన్‌వాడీలపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కేపీ నారాయణ స్వామి, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ తాలుకా కార్యదర్శి జయశ్రీ అన్నారు. అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా బుధవారం ఉరితాడు వేసుకొని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని అడుగుతున్నామే తప్ప, ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరడం లేదన్నారు. ఎస్మా చట్టాన్ని ఉపయోగిస్తూ, బెదిరింపులకు పాల్ప డటం ప్రభుత్వం అవివేకమన్నారు. అంగన్‌వాడీలకు సీనియర్ న్యాయవాదులు వాయుజోత్తమ రావు, షాకీర్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు షైనా, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు భారతి, బాలరంగమ్మ, లీలావతమ్మ, సరోజమ్మ, ఈరమ్మ పాల్గొన్నారు.

ఆదోని: అంగన్‌వాడీల సమ్మెను అణిచివేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు అజయ్ బాబు, ఈరన్న అన్నారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు మోకాళ్లపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమ్మెను అణిచివే సేందుకు జగన్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అంగన్‌వాడీ సేవలను ప్రభుత్వం అత్యవసర చట్టం పరిధిలోకి తీసువచ్చి ఎస్మాను ప్రయోగించిందని, ఆ తర్వాత వారి ఉద్యోగాల తొలగింపునకు తెర తీశారన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, తిప్పన్న, గోపాల్, వెంకటమ్మ, కృష్ణవేణి, వరలక్ష్మి, రేణుక, శారద పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: ఎమ్మిగనూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు చేపట్టిన సమ్మె బుధవారంతో 30వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు 30 ఆకారంలో కూర్చొని నిరసన తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు గోవర్ధన మ్మ, గ్రేషమ్మ, కృష్ణవేణమ్మ, శైలజ మాట్లాడుతూ సీఎం జగన్ స్పందించి తమ సమస్యలను పరిష్కరించకపోతే ఎన్ని రోజులైనా సమ్మెను ఆపేది లేదన్నారు. మంత్రులు తమ బుద్ధిని మార్చుకొని సీఎంకు మంచి సలహాలను ఇవ్వాలన్నారు. మాట తప్పను, మడమ తిప్పను అన్న సీఎంకు సలహాదా రుడైన సజ్జల రామకృష్ణ సీఎంకు హామీలను గుర్తు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు రాముడు, తిమ్మగురుడు, రాజు, ప్రసాద్‌లతో పాటు 450 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మంత్రాలయం: మంత్రాలయంలో అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజు కొనసాగింది. అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

వెల్దుర్తి: పట్టణంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో వెల్దుర్తి, క్రిష్ణగిరి మండలాల అంగన్‌వాడీలు చేపడుతున్న నిరసనలు బుధవారం నాటికి 30 రోజులకు చేరాయి. ఈ సందర్భంగా వెల్దుర్తి, కృష్ణగిరి మండలాల కార్యదర్శులు ఈదమ్మ, చాందినీ మాట్లాడుతూ నాడు పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని న్యాయమైన హక్కుల సాధన కోసం నిరసనలు వ్యక్తం చేస్తుంటే వైసీపీ ప్రభుత్వం అంగన్వాడీల ఐక్యతను దెబ్బ తీసేందుకు సమ్మెను నిషేధిస్తూ కుట్రపూరితంగా ఎస్మా చట్టాన్ని తెచ్చిందని విమర్శించారు. ఎస్మా చట్టం ప్రయోగించినంత మాత్రాన భయపడేది లేదని తేల్చిచెప్పారు. అంగన్‌వాడీ సమస్యలు పరిష్కరించేత వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు.



ఆలూరులో ఉరితాడు వేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



ఆదోనిలో..



మంత్రాలయంలో..